అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 24 మే 2023

ముత్యంపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

ఎరువులు, విత్తనాలు తీసుకునేటప్పుడు రైతులు తప్పకుండా బిల్లు రసీదు తీసుకోవాలని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ సూచించారు. మంగళవారం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పచ్చిరొట్ట ఎరువులు వాడడం వలన కలిగే లాభాలు, సేంద్రీయ వ్యవసాయం, వేసవి దుక్కులపై, భూసార పరీక్షల ప్రాముఖ్యతపై, పప్పు దినుసుల పంటలు వేసుకోవడం వలన నేలకు కలిగే ఉపయోగాలు, నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. అనంతరం మల్కేపల్లి వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు వరి నాణ్యత ప్రమాణాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ఏవో దేవులపల్లి వందన, ఏఈవోలు దివ్య, అంజలి, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

నిషేధిత గ్లైఫోసెట్ పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని గూడెం ప్రాణహిత సరిహద్దుల్లో గల చెక్ పోస్ట్ వద్ద మంగళవారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు నిషేధిత గ్లైఫోసెట్ రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కన్నెపల్లి మండలం దాంపూర్ గ్రామానికి చెందిన తలండి రవి అనే వ్యక్తి మహారాష్ట్ర నుండి నిషేధిత పత్తి విత్తనాలు 12 కిలోలు, ఐదు లీటర్ల గ్లైపోసిట్, తీసుకువస్తున్న క్రమంలో వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామన్నారు. వాటి విలువ సుమారు రూ.20,280 రూపాయలు ఉంటుందన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని తలండి రవి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఏఈవో విజయ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. కాగా నిషేధిత గ్లైఫోసెట్, నకిలీ విత్తనాలు ఎవరు విక్రయించినా, సరఫరా చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

మళ్లీ నకిలీ కలకలం..!

అన్నదాతలకు నకిలీ విత్తనాల బెడద ఈ ఏడాది కూడా తప్పేలా కనిపించడం లేదు. గతేడాది భారీగా పట్టుబడినట్లుగానే.. ఈ సంవత్సరం కూడా ఇదే పరిస్థితి పునరావృతమయ్యేలా కనిపిస్తోంది. తాజాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం రాళ్లగూడలో ఏకంగా 20క్వింటాళ్ల నిషేదిత పత్తి విత్తనాలు పట్టుబడటం కలకలం రేపుతోంది. ఈ మండలంలో వారం వ్యవధిలోనే రెండు గ్రామాల్లో నకిలీ విత్తనాలు లభ్యమయ్యాయి. దీంతో పక్షం రోజుల ముందు నుంచే ఆయా గ్రామాల్లోకి భారీ ఎత్తున చేరినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీలపై టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టడంతో వీరికి చిక్కకుండా అడ్డదారుల్లో వీటి విక్రయాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రం నుంచి నియమిత ఏజెంట్ల ద్వారా జిల్లాలోకి ఈ నిషేదిత పత్తి విత్తనాలు ప్రవేశించినట్లు ప్రచారం జరుగుతోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇప్పటికే విత్తన దుకాణాల్లో, సరిహద్దుల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నా.. నకిలీ విత్తనాలు పట్టుబడటం చర్చనీయాంశమైంది.

- దహెగాంలో పట్టుబడిన నిషేధిత పత్తి విత్తనాలు
- ఇప్పటికే గ్రామాల్లోకి భారీగా చేరినట్టు అనుమానం
- టాస్క్‌ఫోర్స్ బృందాలకు పట్టుబడుతున్నా ఆగని దందా
- దిగుబడి ఆశ చూపుతూ రైతులకు అంటగడుతున్న వైనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, దహెగాం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏటా నకిలీ విత్తనాలు అన్నదాతలను నట్టేటా ముంచుతున్నాయి. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే జిల్లాలోకి అక్రమ మార్గాల్లోకి ప్రవేశిస్తుండటం చర్చనీయాంశమైంది. ప్రభుత్వం నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేయడంతో జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. ఆయా దుకాణాలు, జిల్లాల సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశాయి. అయిన్నపటికీ ఈ బృందాల కండ్లు కప్పి అక్రమ మార్గాల్లో గ్లైసిస్ నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. దహెగాం మండలంలో కేవలం వారం వ్యవధిలోనే రెండు గ్రామాల్లో నిషేదిత పత్తివిత్తనాలు పట్టుబడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. ఆంధ్రా ప్రాంతం నుంచి ఇప్పటికే ఏజెంట్ల ద్వారా ఆయా గ్రామాల్లోకి చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే పంటలో అధిక దిగుబడి రావడంతో పాటు నిషేదిత గ్లైపోసెట్ మందు ద్వారా గడ్డిని పూర్తిగా తొలగించేందుకు ఆస్కారం ఉంటుందని కలుపు..కూలీల కొరత వంటి సమస్యలను అధిగమించవచ్చని రైతులకు మభ్యపెడుతున్నట్లు తెలుస్తోంది. తక్కువ ధరతో పాటు కలుపు సమస్యలు కూడా దూరమయ్యే అవకాశం ఉండటంతో రైతులు ఈ విత్తనాల పట్ల ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇక్కడ నిషేదంగా ఉన్న గ్లైపోసెట్ గడ్డి మందు మహారాష్ట్రలో అనుమతి ఉండటంతో అక్కడ్నుంచి ఇక్కడకు సులువుగా సరఫరా అవుతోంది.

గుట్టుచప్పుడు కాకుండా విక్రయం..!

నిషేదిత పత్తి విత్తనాలను పూర్తిగా నిర్మూలించాలని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆయా జిల్లాలో ఎక్కడికక్కడ టాస్క్‌ఫోర్స్ బృందాలు వీటిపై పూర్తిగా నిఘా ఉంచాయి. కానీ ఇప్పటికే పొరుగు రాష్ట్రం నుంచి విత్తనాలు జిల్లాలోకి ప్రవేశించడం.. ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో అవసరమైన రైతులకు వీటిని అంటగట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఏజెంట్లు రహస్య ప్రాంతాల్లోని గోదాంలలో నిల్వ ఉంచుతూ గ్రామాల్లో పరిచయం ఉన్న వ్యక్తులతో రైతులకు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా దహెగాం మండలం రాళ్లగూడలో ఏకంగా 20కిలోల నిషేదిత పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. వారం రోజుల క్రితమే ఇదే మండలంలోని ఇట్యాలలో లభ్యం కావడం.. సమీప భీమిని మండలం కేస్లాపూర్‌లో ఓ వ్యక్తిని అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది. మరోపక్క ఇప్పటికే అనేక గ్రామాలకు ఈ విత్తనాలు చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సమస్య అధికంగా దహెగాం, బెజ్జూర్, భీమిని, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో విచ్చలవిడిగా ఈ అక్రమ వ్యాపారం జరుగున్నట్లు తెలుస్తోంది. కాగజ్‌నగర్ పట్టణ కేంద్రంగా ఈ వ్యాపారం సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ సమస్య మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎక్కువగా కనిపిస్తోంది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోనూ అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో ఈ సమస్య ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటికి అడ్డకట్ట పడితేనే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు



సనత్‌కుమార్, ఎస్సై, దహెగాం

నిషేదిత పత్తి విత్తనాలు, గడ్డి మందును ఎవరైనా విక్రయిస్తూ పట్టుబడితే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం. ఎవరి వద్దనైనా ఇవి నిల్వ ఉంటే వాడకుండా వెంటనే పడేయాలి. రైతులు కూడా వీటిని కొనుగోలు చేసి నష్టపోవద్దు. వీటిని సాగు చేస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ



నవతెలంగాణ-దండేపల్లి

మండలం కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం ఏడీఏ అనిత రైతులకు జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు 65 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జీలుగా 30 కిలోల సంచి రూ.843, జనుము 40 కిలోల బస్త రూ.1225కు అందజేస్తున్నామని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, సహకార సంఘం అధ్యక్షుడు కాసనగొట్టు లింగన్న, ఎంపిటిసి శ్రీనివాస్,మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్, ఏఈవో రజిత సహకార సంఘం కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్జిన్ డైరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల జరిగిన ఆర్జిన్ డెయిరీ వ్యవహారంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తూ హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు పెట్టిన ఆర్జిన్ కంపెనీ డైరెక్టర్ ఆది నారాయణ, శేజల్ మీద తగు చర్యలు తీసుకోవాలని నేతకాని మహర్ సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. కుట్రలు చేసి దళిత ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇలాంటి చర్యలు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నేతకాని మహర్ కుల హక్కుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జాడి రాంచందర్, జిల్లా కార్యదర్శి గోనె రవి, జిల్లా కమిటీ సభ్యులు సల్లూరి ప్రభాకర్, బి. ప్రవీణ్, శంకరయ్య, సాయి, దుర్గం మల్లేష్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్‌లోని దేవునిగూడా గ్రామం నుంచి, బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న కలపను ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్ మంగళవారం పట్టుకున్నారు. దేవుని గూడా గ్రామం నుంచి దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి బొలెరో వాహనంలో 25 టేకు దుంగలను పట్టుకొని జన్నారం అటవీ రేంజ్ కు తరలించారు. పట్టుకున్న 25 టేకు దుంగల విలువ రూ.1,20,000 ఉంటుందని తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా కలప రవాణా చేస్తే పీడీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మందికి ఉపయోగకరంగా ఉందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆసిఫాబాద్ మండలంలోని వావుదాం, రహపెల్లి, ఈదులవాడ, చిలాటిగూడ, కౌటగూడ, బూరుగుడ, చిర్రకుంట, వాంకిడి మండలం సామెల, రెబ్బెన మండలం గోలేటి తక్కలపల్లి, కిష్టాపూర్, ఖైరిగూడ, జైనూరు మండలం మేమేన్ పుర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసా ఇస్తుందన్నారు. వందల కోట్ల రూపాయలు ఈ పథకం కింద ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, సర్పంచులు భీమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని న్యూ లోలం గ్రామానికి చెందిన చెందిల మోహన్ యొక్క లేగదూడ ఇటీవల చిరుత దాడిలో మృతి చెందగా పశువు లబ్ధిదారునికి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.25,000 రూపాయల నష్టపరిహారం చెక్కును మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వన్య ప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అటవీ వన్యప్రాణుల దాడులలో ఆస్తి నష్టం సంభవించిన లబ్ధిదారుల శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నష్టపరిహారాన్ని మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాసర సర్కిల్ అటవీ శాఖ సీసీఎఫ్ శర్వానంద్, డీఎఫ్ ఓ సునీల్, జడ్పీ చైర్మన్ విజయలక్ష్మి రామ్ కిషన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, సర్పంచ్ ఒడ్నం సరితా కృష్ణ, అటవీ శాఖ అధికారులు శ్రీదేవి, వెన్నెల, మోహన్, కంబారావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పాలాభిషేకం చేసిన జేపీఎస్‌లు

నవతెలంగాణ-సిరికొండ

ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనివ్వడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.తమ కష్టాలను గుర్తించి రెగ్యులరైజ్ చేయడం చాలా సంతోషకరమని, మరింత బాధ్యతతో తమ విధులను సక్రమంగా నిర్వహించి, మరిన్ని జాతీయ స్థాయి అవార్డులను పొందే విధంగా కృషి చేస్తామని పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీధర్,అరుణ్,సునీల్,అజ్మత్, నీత,శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని బన్సపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం రోజున పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004-05 విద్యా సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆనాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు బోధించిన గురువులతో గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, పూర్వ ఉపాధ్యాయులు పోశెట్టి, లక్ష్మన్, స్వామి, అశోక్, మురళీధర్, దేవన్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట రుణాలు మాఫీ చేస్తామని కేసీఆర్ నమ్మించి మోసం చేశారని, ఆయనకు ప్రజాకోర్టులో శిక్ష పడుతుందని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఏ రంగాన్ని కూడా పట్టించుకోకుండా కేవలం తమ నాయకులను, కుటుంబసభ్యులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే గట్టి గుణపాఠం చెప్తారని తెలిపారు. మంగళవారం మండలంలోని చుంచుపెల్లి, చింతకుంట, హీరాపూర్ గ్రామాల్లో పల్లెపల్లెకు పాల్వాయి- గడపగడపకు బీజేపీ 15వ రోజు పాదయాత్రలో భాగంగా గ్రామాల్లోని సమస్యలను ప్రజలను గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రూ.లక్ష పంట రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని, నేడు పంట రుణమాఫీ చేయకపోగా రూ.లక్ష అసలుకు రూ.లక్ష వడ్డీ మొత్తం రూ.రెండు లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని, రైతులకు హామీ ఇచ్చిన మాటను తప్పిన ముఖ్యమంత్రి ప్రజాకోర్టులో శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని వాగ్దానం చేసిన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎందుకు ముఖం చాటేశాడని ప్రశ్నించారు. అలాగే గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతోనే సాధ్యమవుతుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాడుకు మద్దతివ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు గడ్డం రంగయ్య, బుక్య వినోద్, మల్లబోయిన రాజేందర్, సతీష్, రాజేష్, ప్రావన్, పురుషోత్తం పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్‌బోర్కడే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్‌బోర్కడే అన్నారు. మంగళవారం హైదరాబాదు నుంచి మంత్రి హరీష్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా నుంచి పాల్గొన్న ఆయన జిల్లాలో చేపడుతున్న కార్యక్రమ వివరాలను తెలియజేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ పట్టణాలలో న్యూట్రిషన్ కిట్లను గర్భిణీలకు అందజేసి వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలలో ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాల నిర్మాణం కొరకు స్థలాలు ఎంపిక పనులలో భాగంగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పల్లె దవాఖానాలను నిర్మించి ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలో కేటాయించిన వైద్య కళాశాల నిర్మాణం పనులను వేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో కంటి వెలుగు 2వ మిడత కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్‌రావు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కాగజ్‌గర్ మండలం లైనుగూడ గ్రామపంచాయతీ ఎల్లాపూర్ గ్రామస్తులు జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి వర్షాకాలంలో రాకపోకలు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని అన్నారు. పూనగూడా కాలువ నుండి ఎల్లాపూర్ వరకు రహదారి సౌకర్యం కల్పిస్తే అనుకూలంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రామచందర్, భగవంతరావు, తులసీరాం, బాధిరావు, బొజ్జిరావు పాల్గొన్నారు.

బ్లూ భీమ్ యూత్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రం లో గల బ్లూ భీమ్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు, వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై అప్పారావు మాట్లాడుతూ బ్లూ భీమ్ సేవలు బాగున్నాయని వృద్ధులను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మిగితా యువజన సంఘాలు కూడా ఇదే విధంగా ముందుకెళ్లాలని సూచించారు. యూత్ అధ్యక్షుడు ప్రేమేందర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శేకర్, అరవింద్, ప్రసాద్, గోపి, రూపేందర్, సురేష్, సంతోష్, రాములు, వినోద్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌లో సత్తా చాటిన కర్ణపేట వాసి



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కర్ణపేట గ్రామపంచాయతీకి చెందిన అజ్మీరా సంకేత్ కుమార్ సివిల్స్ లో ఆల్ ఇండియా స్థాయిలో 35వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. సంకేత్ కుమార్ ప్రాథమిక విద్యను కర్ణపేటలో అభ్యసించగా ఉన్నత విద్యను హైదరాబాదులో చదివారు. ఐఐటీ ఢిల్లీలో మెకానికల్ ఇంజనీర్‌గా పట్టా సాధించిన సంకేత్ అందులోనే మాస్టర్ ఆఫ్ రీసెర్చ్ (ఎమ్మార్)లో గోల్డ్ మెడల్ సాధించాడు. తండ్రి అజ్మీరా ప్రేమ్ సింగ్ అగ్రికల్చర్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి సునీత ప్రైవేట్ ఉద్యోగి. సంకేత్ కుమార్ 2021 సంవత్సరంలో మొదటి ప్రయత్నంలో సివిల్స్‌లో విఫలం కాగా రెండో ప్రయత్నంలో 2022లో జరిగిన సివిల్స్ పరీక్షలు ఆల్ ఇండియా స్థాయిలో 35వ ర్యాంకు సాధించారు. సివిల్స్‌లో ప్రతిభ కనబర్చిన సంకేత్‌ను కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

విత్తనాలపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

జిల్లా కేంద్రంలో వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా విత్తన మేళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏఈఓ రాజేశ్వర్, ఏఈఓ సాయికృష్ణ పేర్కొన్నారు.బుధవారం ఉదయం జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి విడుదల అయిన వివిధ సోయా చిక్కుడు రకాలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను విక్రయానికి ఉంచడంతో పాటు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి గల రైతులు జిల్లా కేంద్రంలో నిర్వహించే మేళాను విజయవంతం చేయాలని కోరారు.

సాధారణ కాన్పులపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రతి వారం జరిగే సాధారణ కాన్పుల ప్రేరణలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రజని సాధారణ కాన్పుల కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనీమియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఆహార నియమాలు తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్యాం కుమార్, పిహెచ్ఎన్ జయప్రమోద,హెడ్ స్టాఫ్ నర్సు స్వప్న, ఏఎన్ఎం సునీత, కుష్బీ, గుండంపల్లి గ్రామాల ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శీతల శవ పేటిక వితరణ

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెలగనూరు గ్రామానికి చెందిన ప్రజా రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.80 వేల రూపాయల విలువ గల శీతల శవ పేటికను గ్రామ పంచాయతీకి విరాళంగా అందించారు. శవ పేటకను సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శంకరయ్య మాట్లాడుతూ ప్రజా రైతు సేవా సంఘం సేవ కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా రైతు సేవ సంఘం నాయకులు చుంచు శ్రీనివాస్, గూడ తిరుపతి, ఉప సర్పంచ్ కాంద్రపు లక్ష్మణ్, కార్యదర్శి సత్తయ్య, నాయకులు హరీష్, బుచ్చన్న శ్రీనివాస్, ఎసయ్య పాల్గొన్నారు.

రిమ్స్ ఆస్పత్రిలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ,స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ తలసేమియా సొసైటీ స్టేట్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ సోదరుడు మహ్మద్ అజ్జు వర్ధంతిని పురస్కరించుకొని పేదలు, నిస్సహాయులకు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మహ్మద్ రఫీ, భూరె సురేష్, రామకృష్ణ, విశాల్, నిజార్,ఇర్ఫాన్,దానిష్ పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయం ప్రారంభం : మంత్రి



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి)ఎక్స్‌రోడ్ వద్ద రూ.3.50కోట్లతో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని (ఆర్‌టీఓ) మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో నిర్మల్ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. ఇది వరకు రవాణా శాఖ కార్యాలయం లేనందున ఇబ్బందులు ఉండేవని, నూతన కార్యాలయం ఏర్పాటుతో ఆ సమస్యలు దూరమవుతాయని వివరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్, జిల్లా రవాణా అధికారి అజయ్ కుమార్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వెంకట్‌రాంరెడ్డి,ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి,అడెల్లి ఆలయ చైర్మన్ చందు, ఎఎంసి చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, గ్రామ సర్పంచ్ చాట్ల లక్ష్మీ, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి,ఆయ గ్రామాల సర్పంచ్ లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోలీసుల చాకచక్యంతో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-నార్నూర్

పోలీసుల చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం గాదిగూడ మండలంలోని దాబా(బి) ఎస్సీగూడ వద్ద లోకారి గ్రామానికి చెందిన సత్యంకు సంబంధించిన ఐచర్ వాహనం ఉమ్రి గ్రామం నుంచి లొద్దిగూడ గ్రామానికి వెళుతుండగా విద్యుత్ షాట్ సర్క్యూట్‌కి గురైంది. దీనితో మంటలు చెలరేగాయి.ఈ విషయం తెలుసుకున్న గాదిగూడ ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని తన డ్రైవర్ సహకారంతో మంటలతో ఉన్న ఐచర్ వాహనాన్ని నడుపుతూ గ్రామం దాటించి నిర్మానుష్యంగా ఉన్న స్థలానికి తీసుకొచ్చి మంటలను ఆర్పివేశారు. ఎస్ఐ సమయస్ఫూర్తితో పాటు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. సమయస్ఫూర్తి వ్యవహరించిన ఎస్ఐని గ్రామస్తులు అభినందించి ధన్యవాదాలు తెలిపారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. 18 ఏండ్ల పైబడిన వారు ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కంటి చూపు సమస్య ఉన్న వారికి కండ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు శిబిరంలో వైద్యసిబ్బంది జయశ్రీ, మల్లేష్, ఈశ్వర్, శీల, ఆశా కార్యకర్త నిర్మల ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-సిరికొండ

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో సానిటేషన్ తో పాటు వర్షపు నీరు నిలువ లేకుండా చూడాలని అన్నారు. గ్రామ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్, ఎంపీఓ అతుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

నవతెలంగాణ-నిర్మల్

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి మూడురోజుల జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడారు. డ్రంకన్‌డ్రైవ్ కేసులో పట్టుబడ్డ 35 మందిని కోర్టులో ప్రవేశపెట్టగా 34 మందికి రూ.35వేలు 300 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆపదలో యువకుని రక్తదానం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలానికి చెందిన గుజ్జరి ఈశ్వర్ అనే యువకుడు ఆపదలో అత్యవసర సమయంలో రక్తదానం చేసి తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరమని తెలిసి స్పందించిన యువకున్ని పలువురు అభినందించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జైనథ్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్దీకరణ ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో మంగళవారం ఉదయం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పంచాయతీ కార్యదర్శులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ మండల ఎంపీపీ మర్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సవాపురే విజయ్, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు దేవన్న, బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

ఖరీఫ్ సీజన్‌లో పత్తివిత్తనాలు కొనుగోలు సమయంలో నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ముక్రా(బి) ఏఈఓ సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండలంలోని ముక్రా(బి) గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కల్తీ విత్తనాలు తీసుకోరాదని, అలాగే రైతులు తీసుకునే విత్తనాలు ఏ షాపులో తీసుకున్న రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఎవరైనా నేరుగా ఇచ్చినా తీసుకోవద్దని అన్నారు. సోయా బీన్ బ్యాగులు లేబుల్ ఉన్న బ్యాగులను మాత్రమే తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, ఉపసర్పంచ్ పాన్పట్టే శివాజీ, సొసైటీ సీఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

డీఎస్పీ నాయకునికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు అగ్గిమల్ల గణేష్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట దళిత సంఘాల నాయకులు శైలేందర్ వాగ్మారే, జాడి రాజారెడ్డి, దుర్గం వెంకటనారాయణ, మాధస్తూ మహేందర్, బన్సోడే రాహుల్, సూరజ్ కాంబ్లె, కావేటి మోహన్, రఘునాథ్ ఆడే, రాహుల్ జాందడే, జాడి అజయ్ ఉన్నారు.

పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి

నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో నిర్వహించాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బాణావత్ గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. దేశ అత్యున్నతమైన పార్లమెంట్ భవనం దేశ ప్రజల సహాయ సహకారాలతోనే నిర్మించారని తెలిపారు. మతతత్వ పార్టీ అయిన బీజేపీ నాయకుడు, ప్రధాని నరేంద్ర మోడీకి పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించే అర్హత లేదని అన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన 85వ ఆర్టికల్ ప్రకారం ప్రారంభోత్సవ అర్హత రాష్ట్రపతికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో బహుజన ముక్తి పార్టీ అధ్యక్షుడు కాంబ్లే సూర్యకాంత్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ అశోక్ నాయక్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు రాచమల్ల అశోక్ పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసిన జేపీఎస్‌లు

నవతెలంగాణ-నిర్మల్

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) సర్వీసును క్రమబద్ధీకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సర్వీసును రెగ్యులరైజ్ చేస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. ప్రభుత్వం ఉద్యోగుల సేవను గుర్తించి, రెగ్యులర్ చేసిందని జిల్లా అభివృద్ధికి పాటుపడుతూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి వారికి సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ రామ్‌కిషన్‌రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు బసగుట్ట శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజువర్మ, నాయకులు ప్రవీణ్, అభిలాష్, గొజ్జ నితీష్, సంధ్య ఉన్నారు.

దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు జిల్లా కలెక్టర్ లు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత అధికారులతో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు, కేసీఆర్ కిట్, కంటి వెలుగు, సిపిఆర్ పై అవగాహన, పల్లె దవాఖానా, బస్తీ దవాఖాన తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్‌ల పంపిణీకి పకడ్బందీగా చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, ఆర్అండ్ బి ఎస్ఈ. రాజేందర్ నాయక్, ఈఈ నర్సయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాథోడ్ భీమ్ రావు, పంచాయితీ రాజ్ ఈఈ మహావీర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాసర అమ్మవారికి వెండి హంస బహూకరణ

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారికి జీఎంఆర్ గ్రూప్ సంస్థ అధిపతులు తయారు చేయించిన రెండు కిలోల 800 గ్రాముల వెండి హంసను మంగళవారం ఆలయ ఈఓ విజయ రామారావు, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి సమక్షంలో ఆలయ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెండి హంసకు అమ్మవారి సన్నిధిలో మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారి చెంత ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శరత్ పాటక్, ఆలయ ఏఈఓ సుదర్శన్‌గౌడ్, ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏలను ప్రభుత్వం చర్చలకు పిలువాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-నిర్మల్

సమ్మె చేస్తున్న వీఓఏలను ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలువాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమ్మె శిబిరాన్ని సందర్శించి, మాట్లాడారు. ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 35 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించి, నిరసన తెలుపుతామని అన్నారు. 24న భైంసాలో, 25న ఖానాపూర్‌లో, 26న నిర్మల్ నియోజకవర్గ కేంద్రాల్లో బోనాల పండుగ కార్యక్రమాన్ని ఐకేపీ వీఓఏలు, మహిళా గ్రూప్ సభ్యులు నిర్వహించబోతున్నారని తెలిపారు. పెద్ద ఎత్తున మహిళ సంఘాల సభ్యులు పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా



నాయకులు సదానంద్, గంగాజల, రజిని, లక్ష్మి, జ్యోతి, రాధా, లావణ్య, సంధ్య, కళ, శ్వేత పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకులవి దిగజారుడు రాజకీయాలు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని 55 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ, 17 సంవత్సరాల నుంచి పాలిస్తున్న బీజేపీ పార్టీలు ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ఆ పార్టీ నాయకులు, తమ నాయకుడు కేసీఆర్ ఆడపడుచులకు అందించిన బతుకమ్మ చీరలు, రంజాన్ చీరల విషయంలో అవాకులు పేలితే సహించబోమని హెచ్చరించారు. దళితబంధు, రైతు బీమా, అమ్మ ఒడి, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ వంటి అనేక పథకాలతో కేసీఆర్ ప్రజలకు చేరువవుతుంటే బీజేపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. వారి కుట్రను తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వివిధ వార్డులలో వార్డు సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, మంచి ఫలితాలను సాధించవచ్చుని ఆశాభావం వ్యక్త చేశారు. గర్భిణీ మహిళ నుండి ప్రజా సంక్షేమ పథకాల వరకు ప్రభుత్వం అన్ని విషయాలపై ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌతు మనోహర్, పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్లు అర్చన, సంగీత, వెంకన్న, లక్ష్మణ్, నాయకులు మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, స్వరూప రాణి, మమత, దివిటి రాజు, రామ్‌కుమార్, ధర్మపాల్, గంగారెడ్డి, శైలేందర్, శివకుమార్ పాల్గొన్నారు.

అటవీ పరిసర ప్రాంత ప్రజలకు అండగా ఉంటాం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్

అటవీ పరిసర ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీ కార్యాలయంలో సారంగాపూర్, నిర్మల్ మండలాల్లో ఇటీవల అడవి జంతువుల వల్ల మృతి చెందిన పాడి పశువుల కుటుంబ సభ్యులకు మంగళవారం ఆయన నష్టపరిహారం చెక్కులను అందజేశారు. నిర్మల్ మండలం లోలం గ్రామానికి చెందిన మోహన్‌కు రూ.25వేలు, సారంగాపూర్ మండలం ఇప్పచెల్మ గ్రామానికి చెందిన కంబారావుకు రూ.39 వేల నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వన్యమృగాల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. వన్యప్రాణులు జనావాస ప్రాంతాల్లోకి రాకుండా స్ట్రెంచులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కన్జర్వేటివ్



ఫారెస్ట్ శర్వానంద్, డీఎఫ్ఓ సునీల్ హిరమత్, ఎఫ్ఆర్ఓ జైపాల్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అన్ని వర్గాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం జమాతే ఉల్మా హింద్ భవన నిర్మాణ పనులను సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. సుమారు రూ.35లక్షల నిధులతో నిర్మించనున్న భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను జమాతే ఉల్మా హింద్ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని అన్నారు. అందుకు అనుగుణంగానే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద దాదాపు రూ.251 కోట్ల నిధులను విడుదల చేశారని, వాటి ద్వారా ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యతను కల్పించడం ద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో అభ్యున్నతి పథంలో నడుస్తోందని వెల్లడించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో భారిగా పెట్టుబడులు పెట్టేందుకు, వివిధ సంస్థలు ముందుకు రావడమే అందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. దేశంలోనే ఎక్కడలేని విధంగా సర్వమతాలను గౌరవిస్తూ సమగ్ర అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, నాయకులు మోబిన్, ఎజాజ్, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా జోగు ప్రేమేందర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమందర్ జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టిన రోజు పురస్కరించుకొని స్థానిక కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. వృద్ధులతో కేక్ కట్ చేయించారు. అనంతరం పండ్లను పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని మాట్లాడుతూ మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పుట్టిన రోజు వేడుకలను వృద్ధులతో కలిసి నిర్వహించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. పట్టణాభివృద్ధికై అహర్నిశలు శ్రమిస్తున్న ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై కేక్ కట్ చేశారు. సభ్యులు ఎమ్మెల్యేకు కేకు తినిపించగా ఆయన పార్టీ కార్యకర్తలకు కేక్ తినిపించారు. ఈ



కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు శివకుమార్, ప్రశాంత్, సాయి, ఇబ్బు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుదాం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని, సాధించేంతవరకు పోరాడుతామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏక్‌నాథ్ ఆలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల కార్యకర్తల సమావేశాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పీసరి శైలేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే హామీలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి బడుగు బలహీనవర్గాల ప్రజలను అణిచివేసి రాజ్యాధికారానికి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి ప్రజాస్వామిక తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చుకోవాలని అన్నారు. బీజేపీ ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలియజేశారు. అనంతరం మండల బీజేపీ ఓబీసీ మోర్చా నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌గౌడ్, కదం చక్రధర్, ఉదిగిరి సాయినాథ్, రాజేశ్వర్ ఇంద్రకాంత్, పవర్ బోజారాం పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మేలు

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతులు తమ తమ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటాలని మండల వ్యవసాయ అధికారి వికార్ హైమద్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్సి గ్రామంలోని రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న రైతులకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటాలని వాటి ద్వారా ఎన్నో లాభాలు పొందేలా ఉంటుందని అన్నారు. గ్రామంలో మిగిలి ఉన్న రైతులు ఆయిల్ పామ్ మొక్కలు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ కింద అందజేస్తామని అన్నారు. కావాల్సిన రైతులు ముందుగా ఆధార్ కార్డ్ బ్యాంక్ అకౌంట్ అందజేసి పంటలను సాగుచేసుకునేలా చూడాలని అన్నారు. ఈ ఆయిల్ పామ్ మొక్కల ద్వారా రైతులకు మంచి లాభాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కవిత రాజేష్, వ్యవసాయ విస్తీరణ అధికారి రాజు, ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రాజమణి, హనుమండ్లు, దత్తాత్రి, గ్రామ రైతులు ఉన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అసాంఘిక చర్యలను పూర్తిగా రూపుమాపాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలోని బృందం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేయగా అదిలాబాద్ పట్టణానికి చెందిన ఏడుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్దనుండి రూ.7వేల 690 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరందరిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సమాజంలో జర్నలిస్టులు అందిస్తున్న సేవలు మరువలేనివని దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ వాల్ పోస్టర్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈనెల 28న తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ కాన్ఫరెన్స్ వాల్ పోస్టర్లను సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ మాట్లాడుతూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని అన్నారు. నిరంతరం వార్తల సేకరణలో గడిపే విలేకరులు సమాజానికి విలువైన సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ యూనిట్ అధ్యక్షులు షాహిద్ తవక్కల్, హమిదుల్ల అన్వర్, హమీం షరీఫ్, కేసర్ యాపై, షాకీర్, తుళజాపూర్ శోభబాయి, జాడి రాజారెడ్డి, మాధస్తూ మహేందర్, కావేటి మోహన్, సూరజ్ కంబ్లె, రాహుల్ జాందడే, జాడి అజయ్ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

యువత చదువుతో పాటు క్రీడ, రాజకీయ రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ నాయకులు అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీపీఆర్ పాఠశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన టీమ్‌లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని, మానసికంగా ఆరోగ్యమైన జీవితాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యువతకు క్రీడా రంగంలో పెద్దమొత్తంలో ప్రోత్సహకం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. యువత చేడు వ్యసనాలకు బానిస కాకుండా దేశాభివృద్ధి గురించి ఆలోచనలుచేస్తూ, దేశాభివృద్ధికి బాటలు వేయాలని అనిల్ జాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, బ్రహ్మానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హత గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఆర్డీఓ రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటరు జాబితాపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం-6 ద్వారా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు పోలింగ్ కేంద్రాల వారిగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి సమగ్ర ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. చనిపోయిన, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన, ఒకే పేరు, ఒకే ఇంటి నెంబర్ వంటి వివరాలతో పలు మార్లు ఉన్న ఓటర్లను గుర్తించి, తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శాంతన్ రావు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్విజ్ కాంపిటీషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. పోటీలో పాల్గొనేవారు 7661889889 నెంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలని అన్నారు. క్విజ్ పోటీ జూన్ రెండో తారీకు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్, జిల్లా సహాయ కార్యదర్శి తోట రాహుల్, జిల్లా నాయకులు వెంకట్ ఉన్నారు.

జీవ వైవిధ్య ఆవశ్యకతపై అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని దేగామా గ్రామంలో మంగళవారం వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ యువతకు జీవ వైవిధ్యం ఆవశ్యకత అనే అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు సరిహద్దున గల దేగామ గ్రామం అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండడంతో అడవుల జిల్లా ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎన్నో రకాల పక్షులు, వన్యప్రాణులు ఈ అడవుల్లో తల దాచుకుంటున్నాయన్నారు. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్మ గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనాలకు వద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూర్

గ్రామంలో నిర్వహించే పోచమ్మ బోనాలకు వెళ్తానంటే తల్లి వద్దన్నందుకు మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బెజ్జూర్ మండలంలోని రెబ్బెన గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెన గ్రామానికి చెందిన నాయిని రవితేజ(15) పదో తరగతి విద్యార్థి సోమవారం రాత్రి గ్రామంలో పోచమ్మ బోనాలు ఉండడంతో వెళ్తానని తల్లికి చెప్పడంతో తల్లి వద్దని అడ్డుకుంది. దీంతో మనస్తాపానికి గురైన రవితేజ మంగళవారం ఉదయం ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. దీనిని అక్కడే ఉన్న సోదరుడు లక్ష్మీనారాయణ గమనించి పురుగుల మందు డబ్బాను విసిరివేశాడు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన రవితేజను కుటుంబసభ్యులు హుటాహుటిన ఉన్నత వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు.

సివిల్స్ ఫలితాల్లో ఆసిఫాబాద్ అభ్యర్థికి 410 ర్యాంకు

నవతెలంగాణ-రెబ్బెన



యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన డోంగ్రి రేవయ్య సత్తా చాటాడు. ఆలిండియా స్థాయిలో 410వ ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. దీంతో రేవయ్యకు అభినందలు వెల్లువెత్తాయి. ఇతని విద్యాభ్యాసమంతా ప్రభుత్వ గురుకులంలో సాగింది. బీటెక్, ఐఐటీ మద్రాస్ చదివాడు. అతని తల్లి డోంగ్రి ఇస్తారుబాయి. ఇతని తల్లి ప్రభుత్వ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తూ చదివించారు. తండ్రి చిన్నతనంలోనే మరణించాడు. ఆలిండియా స్థాయిలో ర్యాంకు సాధించి మారుమూల గ్రామమైన తుంగెడ గ్రామానికి గొప్ప పేరు తీసుకొచ్చిన రేవయ్యను గ్రామస్తులు అభినందించారు.

ఉపాధిహామీ కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-దహెగాం

ఉపాధిహామీ కూలీల డబ్బులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మెర్పెల్లి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో మండలాధ్యక్షుడు సిడాం శంకర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దహెగాం మండలంలో రెండు, మూడు వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తునికాకు బోనస్ డబ్బులు చాలామందికి రాలేదని, వెంటనే ఖాతాల్లో పడే విధంగా ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్ల సౌకర్యం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఖర్జీ నుండి రాంపూర్, దిగిడ, రావులపెల్లి వరకు బీటీ రోడ్డు వేయాలన్నారు. అనంతరం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక విధానాలు అమలుచేస్తూ ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొట్టే విధంగా కుట్రలు పన్నుందని విమర్శించారు. అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే విధంగా నూతన అటవీ పరిరక్షణ నియమాలు తీసుకొచ్చిందని, వీటిని తిప్పి కొట్టేందుకు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నల్లి దామోధర్, మండల ఉపాధ్యక్షుడు దిగిడ బక్కన్న, దూల లక్ష్మి, కమల, కిష్టయ్య, లక్ష్మి, చంద్రక్క, నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బెజ్జూర్



జూనియర్ పంచాయతీ సెక్రటరీలను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ముందు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గతంలో జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వగా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గత 20 రోజుల క్రితం జేపీసీలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ మేరకు వారి యొక్క విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ముఖ్యమంత్రి త్వరలో వారిని రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు తలండి రాములు, కార్యదర్శులు వైకుంఠం, ధర్మయ్య, పోశన్న, తుకారాం, కృష్ణమాచారి పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నవతెలంగాణ-జైపూర్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ మదుసూధన్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. రక్తదానం చేయడం అలవర్చుకోవాలని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా మిగిలిపోవాలని అన్నారు. మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండల పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన వారు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు, స్థానిక తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణ, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అమ్మా యూత్ అధ్యక్షులు చిప్పకుర్తి వెంకటేశ్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన క్రైస్తవులు మంగళవారం గోలేటి గ్రామంలో చర్చి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆసిఫాబాద్ శాసనసభ్యుడు ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు గుంపుల విమలేశ్, బోగారపు ప్రసాద్, పాస్టర్ థిమోతి, రాజారత్నం పాల్గొన్నారు.

నూతన బోర్‌వెల్‌ను ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల వద్ద ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చొరవతో మంగళవారం నూతన బోర్‌వెల్‌ను సర్పంచ్ జమున కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గం రాము, వార్డుసభ్యుడు మల్లారెడ్డి, తేజస్విని, బీఆర్ఎస్ నాయకులు దాగం దామోధర్, ఎర్ర రాజయ్య, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఆహ్వానం

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఈ నెల 28వ తేదీన రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణకు ఆసిఫాబాద్ శాసనసభ్యుడు ఆత్రం సక్కును ఆహ్వానించారు. కార్యక్రమంలో గంగాపూర్ ఆలయ ఛైర్మన్ వోల్వోజుల వెంకటేశం చారి, బీఆర్ఎస్ యువ నాయకులు గంపులు విమలేశ్, గందం సంతోష్, ముంజం శ్యాం, గంగాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్లోజర్స్ సైట్ మిక్స్ ఏమల్సన్ ప్లాంట్ స్థల పరిశీలన

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రామకృష్ణాపూర్ రెస్క్యూ స్టేషన్ సమీప ప్రాంతంలో ఓపెన్ కాస్టులో బ్లాస్టింగ్ కొరకు వాడే ఎక్స్‌ప్లోజర్స్ సైట్ మిక్స్ ఎమెల్షన్ (ఎస్ఎంఈ) ప్లాంట్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎల్ఓసిఎల్)వారిచే ఎరెక్షన్ చేయుటకు మంగళవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్ రెడ్డి, డీజీఎం డి.మండల్ ప్లాంట్ నిర్మించుటకు స్థలాన్ని పరిశీలించారు. ఏరియా త్వరగా డోజింగ్ చేసి ఎరెక్షన్ మ్యాన్ హ్యాండ్లింగ్ చేసే విధంగా అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అలాగే ఎల్ఓసిఎల్ ప్లాంట్‌ను తొందరగా ఎరెక్షన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఏ. రాజేశ్వర్‌రెడ్డి, ఏజిఎం నాగరాజు, కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, ఆర్కే-1ఏ ఇన్‌ఛార్జి, మేనేజర్ జయంత్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

నవతెలంగాణ-తాండూర్

ఐకేపీ వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె సమ్మెలో భాగంగా మంగళవారం వీఓఏలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. నిన్నటి రోజన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాలలో, జిల్లా కలెక్టర్ల ఆఫీసు ముట్టడి నిరసన కార్యక్రమాలు చేస్తున్న సందర్భంలో వీఆర్ఏలపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసు అధికారులఅక్రమ అరెస్టులకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు . కార్యక్రమంలో వీఆర్ఏలు జనార్ధన్, సురేష్, అలీ, రవీందర్, తిరుపతి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నవతెలంగాణ-కోటపల్లి



మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో విత్తన డీలర్‌లతో అవగాహన కార్యక్రమంను ఏఓ మహేందర్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ రూరల్ సీఐ విద్యా సాగర్, కోటపల్లి ఎస్సై వెంకట్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి(ఏఓ) మహేందర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించడం చట్ట రిత్యా నేరం అని నకిలీ విత్తనాలను రైతులకు అమ్మిన, రైతులు విత్తనాలు విత్తే విధంగా ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి డీలర్ ప్రభుత్వం సర్టిఫై చేసిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని అన్నారు. రైతును మోసం చేసే విధంగా ఎవరు ప్రయత్నించిన చట్టరిత్య శిక్షకు అర్హులని అన్నారు. అనంతరం చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకొని నేరానికి పాల్పడిన వారిని పీడియాక్ట్ పెట్టి జైలులో పెడుతుందని అన్నారు. కోటపల్లి మండలం నది పరివాహక ప్రాంతం కనుక మహారాష్ట్రలో దొరికే నకిలి విత్తనాలు గాని నిషేధిత గ్లైపోసిట్ కానీ తీసుకువచ్చి రైతులకు అమ్మినట్లు తెలిసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు కానీ, పోలీస్ శాఖ వారికి గాని వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. నకిలీ విత్తనాలు, నిషేధిత ఎరువులు అమ్మి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రాజ్ కుమార్, శేకర్, మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

సీపీఐ ప్రజాగర్జణ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజా గర్జన పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. ప్రజాగర్జన సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి డాక్టర్ కే.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని సింగరేణి ప్రయివేటీకరణ, కాంట్రాక్టీకరణకు ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు దళిత బంధు పారదర్శకంగా కలెక్టర్ల ద్వారా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగ బృతి కింద రూ.3000 చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నా 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని తదితర సమస్యలపై ప్రజా గర్జన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాగర్జన సభకు కార్మికులు కర్షకులు మేధావులు పార్టీ ప్రజాసంఘాల శ్రేణులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఎండి అక్బర్ అలీ, మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, నక్క వేంకటస్వామి, పార్టీ ప్రజాసంఘాల నాయకులు దుర్గం దేవిదాస్, మారపల్లి రవి, ఏగుడ మొండి, జంగపల్లి సత్యనారాయణ, మోతె రాయలింగు, మాదాస్ శంకర్, కె.దేవానందం, కారుకూరి రాయలింగు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందాన్ని సాధించుకున్నాం



నవతెలంగాణ-నస్పూర్

11వ వేతన కమిటీలో మెరుగైన ఒప్పందాన్ని సాధించుకున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డ్ సభ్యుడు వాయిస్ రెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఎస్ఆర్పీ-3,3ఏ గనిలో గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని వేతన కమిటీ అంశాలను కార్మికులకు క్లుప్తంగా వివరించారు. ఎంజీబీ 19 శాతం సాధించుకున్నామన్నారు. ఒకటవ కేటగిరి కార్మికునికి అలవెన్స్ కాకుండా సుమారు రూ.6,875 నుండి రూ.8000 వరకు, అలవెన్స్‌తో కలుపుకొని నెలకు సుమారుగా రూ.11,000 వరకు పెరిగిందన్నారు. ఎల్ఎల్‌టీసీ రూ. 15వేల వరకు, ఎల్ఐసీ రూ.8,000 నుండి రూ.10000 వరకు, నైట్ షిఫ్ట్, అలవెన్స్, పెట్రోలు అలవెన్స్ కూడా పెరిగిందన్నారు. ప్రతి కార్మికునికి ఏరియర్స్ 23 నెలలు సుమారుగా రూ.2 లక్షల నుండి సీనియర్ కార్మికులకు 4 లక్షల వరకు వస్తాయన్నారు. పెరిగిన జీతాలు జూన్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వస్తుందన్నారు. సీనియర్ కార్మికులకు, ఏ గ్రేడ్ కార్మికులకు రూ. 20వేల వరకు పెరుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శి బాజీ సైదా, సెంట్రల్ కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళి చౌదరి, నాయకులు సుధాకర్, మల్లేష్, ప్రభాకర్, రవి, శ్రీకాంత్, రవీందర్, రమేష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో భారీ వర్షం

- నేలరాలిన చెట్లు-జలమయమైన రోడ్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గాలి వానతో కూడిన వర్షం రావడంతో పట్టణవాసులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం నాలుగు గంటలకు ప్రారంభమైన గాలి వాన గంట పాటు కురిసింది. స్థానిక ఐకేపీ కార్యాలయం ముందు వీఓఏలు చేపడుతున్న సమ్మెకు సంబంధించిన టెంట్ గాలివానకు ఎగిరిపోయింది. దీనితో వీఓఏలు వర్షానికి తడుస్తూనే సమ్మెలో పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక సంజీవయ్య కాలనీ వద్ద మురికి కాలువ సక్రమంగా లేకపోవడంతో ప్రధాన రహదారిపై పెద్ద మొత్తంలో నీరు నిలిచింది.

చొరవ చూపిన ఎస్పీ, గన్‌మెన్లు

వర్షం సమయంలో ఆసిఫాబాద్ నుండి కాగజ్‌నగర్‌కు వస్తున్న జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ మార్గమధ్యలో చెట్లు పడిపోయి ఉండడం, ట్రాఫిక్ నిలిచిపోయింది. తానే చొరవ చూపి రంగంలోకి దిగారు. వర్షంలో తడుస్తూనే రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తన గన్‌మెన్‌లతో కలిసి ఆయన తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. దీనితో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ చొరవ చూపి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కౌటాల

ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని తలోడి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు నమోదు చేసుకోవాలన్నారు. సురక్షా బీమా యోజన పథకానికి 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని, ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండి అందులో డబ్బులు జమ చేసుకుంటే సురక్షా బీమా పథకానికి సంవత్సరానికి రూ.20 చెల్లించినట్టయితే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు.

జీవనజ్యోతి బీమా యోజన పథకానికి రూ.436 సంవత్సరానికి చెల్లించి రూ.రెండు లక్షల సాదారణ లేదా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదని, ఒక్కసారి ఈ పథకాలకు నమోదు చేసుకుంటే ఖాతాలో డబ్బులుంటే దానికదే రెన్యూవల్ అయిపోతుందన్నారు. కార్యక్రమంలో కారోబార్ రమణాచారి, నాందేవ్, అశోక్, జ్యోతి పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తను వేర్వేరు చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తడి-పొడి చెత్తను వేర్వేరుగానే నిల్వ చేయాలని వంజీరి సర్పంచ్ ముంజం రమేష్ ప్రజలకు సూచించారు. సిర్పూర్ పేపర్ మిల్లు, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ సంయుక్తంగా వంజిరిలో చేపడుతున్న తడి పొడి చెత్త సేకరణను పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ తడి పొడి చెత్త నిల్వ చేయటంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఇండ్లలో వెలువడుతున్న చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి నేరుగా ఇంటి ముందుకు వచ్చిన చెత్త బండిలో తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగా చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సేకరించిన తడి, పొడి చెత్తలను గ్రామ పంచాయతీ సిబ్బంది డంపింగ్‌యార్డుకు తరలిస్తారన్నారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయాలను సాగు చేయాలని, మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తడి, పొడి చెత్త నిల్వ చేయటానికి వేర్వేరు డబ్బాలు అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నేరెళ్ళ రాజేశ్వర్, పేపర్ మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ప్రతినిధులు వినల్, అశోక్ పాల్గొన్నారు.

కొత్తపల్లి పంచాయతీని సందర్శన

నవతెలంగాణ-తాండూర్

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాండూరు ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్ గ్రామపంచాయతీ కొత్తపల్లిని ఆకస్మికంగా సందర్శించి పారిశుద్ధ పనులను పర్యవేక్షించారు. పర్యవేక్షణలో భాగంగా గ్రామ పంచాయతీలోని నర్సరీ, క్రిమటోరియం, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకంలో మెలకువలు పాటిస్తూ జాగ్రత్త వహించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డ్ సిగ్రిగేషన్ అనేది జరపాలని స్మశాన వాటికను పిచ్చి మొక్కలు మొలవకుండా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సర్పంచ్ ఏల్పుల రజిత పాల్గొన్నారు.

ధరణిపై అధ్యాయనం

నవతెలంగాణ-కౌటాల

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సాదిక్ పౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై అధ్యాయనంలో భాగంగా మంగళవారం కౌటాల మండలకేంద్రంలో పలువురు రైతులను కలిసి వారితో సమావేశం నిర్వహించి ధరణిపై అధ్యాయనం చేశారు. రైతుల యొక్క సమస్యలను విని వాటికి కావాల్సిన పరిష్కార మార్గాలను రైతులకు సూచించారు. అదేవిధంగా హైకోర్టు ధరణిపై రాష్ట్ర ప్రభుత్వానికి జారీ చేసిన ఉత్తర్వులు తెలుగు అనువాద కాపీలను రైతులకు అందజేశారు. అనంతరం తహసీల్దార్ సాయన్నకు ధరణి ఉత్తర్వుల కాపీలను అందజేశారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ అశ్రఫ్, సాదిక్ పౌండేషన్ సిబ్బంది ఉన్నారు.

పదేళ్లలో ఎకరానికైనా సాగునీరందించారా..?



నవతెలంగాణ-కాగజ్‌నగర్

గడిచిన పదేళ్ల కాలంలో జిల్లాలో ఒక ఎకరానికైనా అదనంగా సాగునీరందించారా అని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. దీనికి జిల్లా ఇన్‌ఛార్జి జొర్రీగల శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అడ, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టుల పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. ఇక్కడి ప్రాణహిత ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి ఇక్కడి రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా రాబోయే ఎన్నికలలో పార్టీ గెలుపుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు కొట్నాక విజయ్, మురళి, కొంగ సత్యనారాయణ, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, చన్నపురి గణపతి, వెంకట్‌నాయక్, సురేష్, రాజేందర్‌గౌడ్, సందీప్‌రాథోడ్, మనోహర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చిన్నరాస్పెల్లి గ్రామంలో గతకొన్ని రోజులుగా సీఎం కప్ పోటీలు మండలస్థాయిలో నిర్వహించగా పుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. పుట్‌బాల్ బాలికల విభాగంలో అంజలి, తేజ, సంధ్యారాణి, రజిత, శిరీష, స్వాతి, అలాగే పుట్‌బాల్ బాలుర విభాగంలో ఉదయ్‌కుమార్, విజయ్‌కుమార్, దేవదాస్, పవన్‌కుమార్ ఎంపిక కాగా ఖోఖో బాలికల విభాగంలో రాజేశ్వరి, అక్షయ, అలాగే కబడ్డీ బాలుర విభాగంలోఇస్తారిని ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

డీలర్ల సమ్మె వాయిదా

నవతెలంగాణ-వాంకిడి

జూన్ 5న నిర్వహించ తలపెట్టిన డీలర్ల సమ్మెను వాయిదా వేయడం జరిగిందని వాంకిడి డీలర్ల సంఘం నాయకులు యశ్వంత్‌రావు, తిరుపతి తెలిపారు. డీలర్ల సమస్యలు పరిష్కరించడానికి పౌర సరఫరాల శాఖ మంత్రి కమలాకర్‌తో చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేయడం జరిగిందని, యదావిధంగా జూన్ నెలలో బియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగించడం జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

పెంచికల్‌పేట్ : మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన దుర్గం తులసీరాం తండ్రి నానయ్య అనారోగ్యంతో మరణించగా మంగళవారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతుడి ఇంటికెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, రాజన్న, ఇలియాస్, కలిల్‌బేగ్, సాజిత్ ఉన్నారు.